# ఐదు నిమిషాలు

"అంతే నంటావా? అన్నయ్యా! నువ్వు మరొక్కమారు ఆలోచించలేవా? ఆలోచిస్తానంటే ఇప్పుడే తొందరలేదు. నువ్వు ఊరునుంచి తిరిగివచ్చేవరకు మేము ఆగగలము" అన్నాడు వేణుగోపాల్.

రామకృష్ణ ఏమీ మాట్లాడకుండా దళసరి కళ్లజోడు అద్దాలను చేతిరుమాలుతో తువడసాగాడు. అతని సమాధానం నోటితో చెప్పినకంటె స్పష్టంగా తెలిసిపోయింది గోపాలానికి.

రామకృష్ణ కళ్ళజోడు పెట్టుకొని చేతివాచీవంక, గోడనున్న గడియారంవంక చూసేడు; రెండూ అయిదు నిమిషాల తేడాతో నడుస్తున్నాయి. ఇదివర కెన్నడూ ఈ రెంటి నడుమ రెండు మూడు నిమిషాలకంటె వ్యత్యాసం ఉండడం మామూలులేదు, అనుకొంటూ తమ్ముడి ముఖంవంక చూసేడు. ఆ చూపు అర్థమేమిటో బాగా తెలిసిన గోపాల్ తనకి ఉన్న కొద్దికాలాన్ని సద్వినియోగ పరచుకొనే పట్టుదల చూపలేదు. దగ్గర దగ్గరగా ఒక నిమిషం కాలం మాట్లాడకుండా కూర్చొని, నెమ్మదిగా లేచి, పడిపోతానేమో అన్నట్టుగా టేబిలును ఆనుకొని; "మరి వెళ్తా నన్నయ్యా! నీకు అవతల రయిలుకి టయిమయి పోతున్నట్టుంది. ఈ వచ్చే ఒకటవ తేదీనుండి మనియార్డరు పంపించకు, నేను మరి కాలేజీ విడిచిపెట్టేసినట్టే." అని అన్నయ్య సమాధానానికి ఎదురుచూడకుండా తలవంచుకొని ద్వారం దాటి వెళ్లిపోతున్నాడు వేణుగోపాల్. "గోపాల్" అని అరిచాడు అతి అసహజమయిన గొంతుతో రామకృష్ణ. వెనక్కి తిరిగివచ్చి ద్వారం దగ్గరనే నిలబడి "పిలిచావా అన్నయ్యా!" అన్నాడు గోపాల్.

రామకృష్ణ కళ్లజోడు తీసి టేబిలుమీద పడేసి, కోటు అంచులు రెండూ రెండుచేతులతో పట్టుకొని, అటూ ఇటూ తిరగసాగాడు. కొద్ది క్షణాలు ద్వారంవద్దనే నిలబడి, "పొరపాటున పిలిచావనుకున్నా నన్నయ్యా! మరి నేను వెళ్తాను" అన్నాడు.

అతని మాట పూర్తికాకుండానే ఉరుమురిమినట్లుగా రామకృష్ణ: 'పిలిచానట? ఎందుకని పిలవాలి? ఏమని పిలవాలి? అసలు పిలిపించుకునే వీలుంచులేకదూ? ఇక నే నన్నయ్యనా? నువ్వు తమ్ముడివా?'

"ఇన్నాళ్లు పెంచి పెద్దచేసేవు, ఈనాడు నా తెలివితక్కువ నీకు దుర్భరంగా అనిపిస్తేమాత్రం నేను నీకు తమ్ముణ్ణి కాకపోతానా?" ఈ మాటలు అంటూ తనకు తెలియకుండానే గోపాల్ గదిలోపలికి ప్రవేశించాడు.

రామకృష్ణ నడక ఆపి, తమ్ముడివంక చూడకుండా, కిటికీదగ్గర నిలబడి, తోటలోని గులాబీ మొక్కను చూస్తూ, "ఇప్పటికి రెండేళ్లయింది ఈ మొక్కను నాటి, ఇంత కష్టపడినందుకు ఇన్ని ముళ్ళు పెరిగాయి తప్ప, ముచ్చటకు ఒక్క పువ్వు పుయ్యలేకపోయింది. స్వార్థపరత్వం మనుష్యులలోనే కాదు, చెట్లలో కూడా నిండిపోయింది."

"అన్నయ్యా నువ్విలా కవిత్వమూ వేదాంతమూ మాట్లాడితే నేనేం చెప్పలేను. నాలో నిన్ను నొప్పించాలనే కోరిక, లవలేశమైనా లేదని నీకు తెలుసును. అయితే ఇప్పుడీ సందర్భంలో నేను నీకు సంబంధించి ఆలోచించలేకపోయేను. ఆలోచించినా..."

"ఎందుకు ఆలోచించాలీ? అను అసలు బుద్ధితక్కువ మాట."

"నిన్ను నువ్వేనా నిందించుకోనక్కరలేదన్నయ్యా! చిన్ననాటినుండి నేటివరకే కాదు, ఏనాటికైనా నువ్వే నాకు ఆదర్శమూర్తివి. అయితే నాలో ఎన్నెన్నో లోపాలున్నాయి. వా టన్నిటినీ ఇన్నాళ్లూ కేవలం నిన్ను సంతృప్తిపరచాలనే ప్రధాన ఆశయపు ప్రాబల్యంవలన దాటుకొని వచ్చేను. నీకోసమే కాకపోతే, బొమ్మలు గీయడంకోసం ఏనాడో చదువు మానుకొని ఉండేవాణ్ణి—పార్టీ భక్తి అనే పేరుతో అధమం జైలుకి వెళ్లి ఉండేవాణ్ణి—ఇంకా ఎందుకు చెప్పడం, ఎన్నెన్నో నీ దృష్టిలో అత్యంత అసమర్థులయినవాళ్లు చెయ్యవలసిన పనులు చేసి ఉండేవాణ్ణి — అయితే బొమ్మలు వెయ్యలేను, కవిత్వంలో లీనం కాలేను; మంచి సంగీతాన్ని ఆరాధించలేను; లోపలి సహజమయిన చలనశీలానికి బిగించిన బిగుకట్లు సడల నీయలేను. ఏం చేసేను, నాకు సహజంగా అణుమాత్రమైనా ఇష్టంలేని, గౌరవంలేని పుస్తకాలను, కేవలం మార్కులు సంపాదించే దృష్టితో వల్లవేస్తూ

వచ్చేను; ఒకరోజు కాదు రెండురోజులు కాదు, ఇన్ని సంవత్సరాలుగా
తంటాలుపడుతూ వచ్చేను. ఎందుకిదంతా! తక్కినవన్నీ నా కెంత సహజ
మయినవీ ప్రియమయినవీ అయినా, అన్నిటికంటె నాకు ప్రధానంగా కోర
దగినది నీ అభిమానమే గనుక—ఇప్పటి ఈ సందర్భం ఇది నా తలకు మించి
నది. నేను చెయ్యగల ననుకొన్న ప్రయత్నం అంతా చేసేను. కాని, ఏదో,
నాకంటె బలమయిన శక్తి నన్ను ఈడ్చుకొని పోతూంది."

"తెలివితక్కువపనులు చేసేవాళ్లందరూ చెప్పే సమాధానమే ఇది.
స్వార్థపరత్వం జీర్ణించిపోయినప్పుడు..."

"సరేలే ఆపేసేవే మన్నయ్యా!"

"మరి చెప్పడానికి కేముంది. నువ్వు వెళ్లు. నన్ను బాధపెట్టడానికి
కాకపోతే ఇప్పుడిలా చదువు మానుకొని, ఎవత్తెనో లేవదీసుకొనివచ్చి, నా
అనుమతీ సహాయం అడగడంలో అర్థం ఏముంది? ఎన్ని పేకమేడలు కట్టు
కొన్నాను నీగురించి. నా చదువుకునే రోజుల్లో బట్టలు పుస్తకాల మాటకేం,
కడుపునిండా తృప్తిగా అన్నం తిన్న సందర్భాలు కూడా వేళ్ళమీద లెక్క
పెట్టదగినవి మాత్రమే. నా స్వంత పుస్తకాలు లేకపోవడమే కాదు, నాది
అని దీపం పెట్టుకోండికి కూడా లేక, వీధి లాంతర్ల వెలుగులో చదువుకొ
న్నాను. స్కూలు జీతానికి డబ్బు సంపాదించడానికి నేను పడిన అగచాట్లు
భగవంతుడికి తెలుసును. అటువంటి పరిస్థితులలో కూడా శెలవులలో వచ్చి
నప్పుడు నీకు ఆట వస్తువులు బట్టలు, తీసుకొని రావడానికి ఆకలిని కూడా
చంపుకునేవాణ్ణి. నా ఆశయం ఒకటే, నన్ను నమిలి మింగుతున్న కష్టాల
స్ఫురణ అయినా లేకుండా నా తమ్ముణ్ణి పెద్దవాణ్ణి చెయ్యాలని నేను సాధించ
లేని ఎన్నెన్నిటినో నా తమ్ముడు సాధించి తీరాలనీ. నాతమ్ముడి భవిష్యత్తు
ఉజ్జ్వలంగా ఉంటుందన్న తృప్తికరమైన హామీ కోసం అవసరమయితే
హాయిగా విషమయినా పుచ్చుకుని ఉండగలిగేవాణ్ణి."

"అన్నయ్యా, అన్నయ్యా! నేనంటూ ఒకణ్ణి లేకపోతే, నీ జీవితం
ఎంత హాయిగా ఆనందమయంగా ఉండి ఉండేదో? నేనే తెలివితక్కువ
వాణ్ణి. చిన్నతనంలోని, నా సరదాలను ఏ ఒక్కదానికో నిర్మొగమాటంగా
జీవితం అర్పించివుంటే, నీకు ఇంతగా విచారం లేకపోయి ఉండును. నాలోని
నిజమయిన గోపాల్ వేరు, నీకు కనిపించే మనిషి వేరు. ఎప్పటికప్పుడు నిన్ను
అసంతృప్తి పరుస్తాననే భయంతో, నిన్ను మోసపుచ్చడం జరిగింది. గాని, నీ

ఆశయాలకు అనుగుణంగా ప్రవర్తిస్తున్నట్లుగా నువ్వనుకుంటున్న గోపాల్ నాలో లేడన్నయ్యా; ఇంతకాలంగా నిన్ను వంచిస్తూ వచ్చిన వంచకు డేమయితేనేమి విచారం నీకు. ప్రస్తుత పరిస్థితులలో నాకు నీ ఆర్థిక సహాయం కంటె ముఖ్యమయినది, ఏమయితేకానీ అని నిన్ను నా కర్మానికి విడిచిపెట్టడమే."

"విడిచిపెట్టక నిన్ను పట్టుకొని నిలవవేస్తున్నవాళ్ళెవరు? పో, నీ కర్మం నీది, నా కర్మం నాది."

"అదే నా భయం, నన్ను పొమ్మని, తరవాత నా గురించి అనవసరంగా దిగులు పెట్టుకుని నీరసించిపోతావని. నాలో లేని గొప్పదనం నువ్వెంతకని తీసుకుని రాగలవు? సబ్బు బుడగ పెద్దది పెద్దది అవుతున్నకొద్దీ పగిలిపోయే పరిస్థితికి మరీ దగ్గరవుతున్నదన్న మాట! అది ఎంత వేగంలో పగిలిపోతే అంత మంచిది; అటువంటిదానిమీద పెద్ద పెద్ద ఆశలు పెట్టుకోవడంలో ఏమి సౌఖ్యం ఉంది?"

"సౌఖ్యమే. నా బ్రతుకంతా సౌఖ్యంకాక మరేమిటి? అట్టడుగు మెట్టున గుమాస్తాకంటె తక్కువ స్థితిలో ఆరంభించాను. ఈ పది సంవత్సరాలూ నా పెళ్ళి, సంసారమూ సౌఖ్యమూ అనేవి లేకుండా ఎందుకున్నానో అందులో నా స్వార్థం ఎంత ఉందో...హు, తెలియనివాడికయితే చెప్పడం"

"నిజమేనన్నయ్యా. నాకు తెలుసును. కానీ స్వార్థరాహిత్యంలోని ఔన్నత్యం గురించి. కాని నా గురించి నేటివరకూ నీకు తెలిసింది చాలా స్వల్పం. నీ తమ్ముడు గోపాల్‌లో నువ్వు చూస్తున్న తెలివయినవాడు, భవిష్యత్తులో అతి ఉజ్వలంగా ప్రకాశించవలసిన కార్యశూరుడూ నూటికి అయిదారు పాళ్ళుకంటె లేడు. అయితే పవిత్రమయిన నీ ఇచ్ఛాశక్తి ప్రాబల్యం ఎంతటిదంటే, నాకంటె ఎంతో తెలివయినవాళ్ళని నాకు తెలిసినవాళ్ళని, మార్కుల పోటీల్లో అతి సులభంగా ఓడించగలిగాను. నాలోని అవగుణాలన్నిటినీ బైటికి రానీయకుండా అణచి ఉంచగలిగాను. లేకపోతే చూడు అన్నయ్యా నువ్వు నా కంటె పదిహేనేళ్లు పెద్దవాడివయి ఉండి కూడా నేటి వరకూ నా భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని, పెళ్ళి చేసుకోడం మానుకో గలిగావు. పోనీ అలాగని, మరేమయినా లోకులు మాటలు అనుకోవలసినట్టుగా ప్రవర్తించావా? నిన్నొక ఋషి అని లోకం చెప్పుకుంటుంది.

కాని చూశావా అన్నయ్యా—నేను నీ తమ్ముణ్ని అని నేనే నమ్మలేను. చిన్నప్పటినుండి బొమ్మలమీద దృష్టి ఉండడంచేత కాబోలు, నాకు స్త్రీల అందంమీద ఇంత కోరిక ఏమిటి చెప్పు—నాకు తెలుసును. ఇదంతా తెలివి తక్కువ, క్షుద్రమయినది, చంచలమయినది అని. కాని, ఏం లాభం? నా శరీరం దానితోపాటు నా మనస్సు నా స్వాధీనంలో ఉంటే కదూ. ఇది వరకూ నీకు చెప్పలేదు. ఇప్పటికీ, రెండుమార్లు ఆత్మహత్యా ప్రయత్నాలు చేశాను. నీకు తెలియదుగాని. ఒకమారు పరీక్షకి ముందురోజు రాత్రి అంతా కొత్తగా వచ్చిన ఒక నవల చదవడంలోపడి, నూటికి నూరు మార్కులు తెస్తానని నీకు మాట ఇచ్చి లెక్కల పేపరు సగానికి సగం తగలేశాను. చూస్తున్నంతసేపూ, తొలినాటిరాత్రి చదివిన పుస్తకంలోని మనుష్యులే కనిపిస్తూ ఉంటే. ఆవేళ సాయంత్రం రైల్వే లైన్లవేపు వెళ్లాను అంతా నిశ్చయం చేసుకుని. నేను బ్రతికివుండి, అనుదినము నీకు కలిగించే ఆశాభంగం ఎక్కువదా? లేక ఒక్కమారుగా చచ్చిపోయి కలిగించే మనోవ్యథ ఎక్కువదా నిర్ణయించుకోలేకపోయాను. దూరాన రైలుకూత వినిపించేసరికి ఇటు పరుగు లంకించుకొన్నాను. కాని, ఎవరో బలంగా వెనక్కి లాగుతున్నట్టే కనిపించింది. అక్కడేగాని రైలు వచ్చేవరకూ వుంటే, అది బలవంతంగా నన్ను కత్తిరించి వుండును. ఆ తరువాత కాస్త సైన్సు విద్యార్థి అనిపించుకొందికి వీలుగా, పొటాసియమ్ సైనేడు హైడ్రోక్లోరిక్ ఏసిడ్ కలిపి హైడ్రోసైనిక్ ఏసిడు తయారు చేశాను.

క్రొత్తబ్లేడు తీసి చేతిమీద గంటు పెట్టుకొన్నాను. కాని, చిట్టచివరి క్షణంలో మళ్ళీ ధైర్యం చాలిందికాదు...అసలు కారణం నీకు చెప్పనేలేదు. చెప్పేస్తాను. అందువల్లనయినా, నామీద నీకు గల అనవసరపు ఆశలు అపోహాలూ అంతరిస్తాయేమో? ఆ మనిషి ఏమీ అందమయినదికాదు, వివాహితురాలు, నాకంటె పెద్దది కూడాను. ఆమె భర్తకి నా పాటలంటే ఇష్టం. నన్ను పిలిచి పాడిస్తూ ఉండేవాడు. నాగురించి ఊరందరితోనూ ఎంతో గొప్పగా చెప్పుకొనేవాడు; అటువంటి వాడికి ద్రోహం చేశానంటే ఏమిటి చెప్పడం. మొదట్లో నాలో ఉత్సాహమూ, కోరికా లేకపోతేనే, నా సామీప్యంలోని క్షుద్రత్వం, లౌక్యం, చాపల్యం మొదలయిన నికృష్టభావాలు—లేకపోతే, అసలు నే ననేవాణ్ని లేకపోతే, ఆవిడలో అటువంటి హీనమైన తలపు ఎందుకు కలుగుతుంది? అతను తలుపుతట్టి పిలిచాడు, ఆవిడ నిట్టూ

రంగా తలుపుతీసి, "గోపాల్‌కి అకస్మాత్తుగా పెద్ద తలనొప్పి వచ్చింది. పడుకో మన్నాను. గట్టిగా మాట్లాడకండి. ఇప్పుడు కొంచెం సర్దుకుంటున్నట్టుంది. అయినా కొంచెం అమృతాంజనం తెచ్చిపెట్టకూడదూ" అన్నది. అతడు పాపం అలాగే మళ్లీ వీధిలోకి వెళ్ళి బజారులో తలనొప్పికి దొరికిన మందు లన్నీ పట్టుకుని వచ్చాడు. నా మనస్సు కొంతసేపు ఆలోచించే శక్తిని కోల్పో యింది. ఆ తరువాత చేసిన ప్రయత్నం ఏ విధంగా వృధా అయింది నీకు చెప్పాను. అందుకే శలవులంతా అక్కడేవుండి చదువుకొంటానన్నవాడిని ఆ రాత్రే బయలుదేరి వచ్చా. మళ్ళీ సంవత్సరం అక్కడే బాగుంటుందని నువ్వెన్ని కారణాలు చెప్పినా కాదని మరొక ఊళ్ళో చదువుకి వెళ్లాను— ఇందాకా ఒకటే నిశ్చయం చేసుకొని లేచిపోయాను. గాని, మళ్ళీ ఇంతసేపు మాట్లాడేక ఆశ కలుగుతున్నది. చూడు, నాలో ఎలాగూ నువ్వనుకున్న గోపాల్ లేడు. నేను నేను కాకపోతే ఏనాటికయినా నాలోని తెలివితక్కు వకీ, దౌర్బల్యానికీ లొంగిపోవలసిన వాణ్నే. అటువంటప్పుడు, లోగడ తటస్థించి నటువంటి వికారమయిన పరిస్థితులు మళ్ళీ తటస్థించకుండా ఉండాలంటే, నేను వేరే స్వతంత్రంగా ఉంటే మరి లాభంలేదు. అదృష్టవశాత్తు, నాకీ లీల అనే మానవ స్వరూపంలోని దేవత దొరికింది. ఆమె నాకంటె ఎంతో తెలి వయింది. ప్రపంచజ్ఞానంగలది; ఎక్కువమంది పిల్లలున్న కుటుంబంలో పెరిగి నది కావడంవల్ల ఆమెలో సాధారణమయిన స్త్రీత్వంకంటే మాతృత్వమే ఎక్కువ ఉందనిపిస్తుంది. నాకు కావలసినది కూడా అదే. అటువంటివాళ్ళు ప్రపంచంలో నూటికీ కోటికీ ఎక్కడో ఉంటారు. ఉన్నా, వాళ్ళను మనం సకాలంలో కలుసుకోడం అన్నది కేవలం దైవికమయిన భాగ్యవిశేషమే."

"ఇటువంటి చాపల్యం ఉన్నవాడికి ప్రతిదీ దైవనిర్ణయమయిన భాగ్య విశేషమే. కనిపించిన ప్రతి మనిషి గురించి ఇలాగే అనుకోవచ్చును. ఎందరు అందమయిన అమ్మాయిలు లేరు, ఎందరు తెలివయినవాళ్ళు లేరు. ఈ అందాన్ని ఈ తెలివితేటలనూ నమ్ముకుని, తొందరపడి నిత్యకృత్యాలకు కావలసిన పాటీకూడా ఆర్జించుకోలేక, కనిన పిల్లలను పెంచి పెద్ద చెయ్య లేక, మన కళ్ళనుండే వాళ్ళు ఎల్లప్పుడూ తమ ఇరుగుపొరుగుల కంటె హీనంగా నానా అగచాట్లు పడుతూఉంటే అప్పుడు ఈ ప్రేమ, ఈ అవ తల మనిషిని తృప్తిపరచాలనే భావమూ ఇవి నిలబడగలవా ? పేద దంపతుల కోపతాపాలు కొట్లాటలు నూటికి నూరుపాళ్ళు దారిద్ర్యంలోంచి పుట్టినవే.

మీదమీంచి కళ్ళు మూసుకుని గెంతినా కాళ్లు విరగక మానవు. నాకేం తెలుసుననుకుని నిప్పు ముట్టుకుంటే కాలక మాన్తుందా ? జీవితమంటే ఇవాళటి ఆటకాదు, ఒకనాటి నటనకాదు; కలకాలమూ తరతరాలుగా అనుభవించవలసిన కష్టసుఖాల కలయిక. అటువంటి దానిని వర్తమానంలోని క్షుద్రమయిన చంచలమయిన లాలసకి లోబడి కర్దమ దుర్గమం చెయ్యడానికి మనకి అధికారం ఏముంది ?"

"అందరూ నీలాటి లక్ష్యశుద్ధిగలవారూ, నిగ్రహపరులే ఉంటారా అన్నయ్యా ? ఈ లోకంలో మోసగాళ్ళు, అశక్తులూ పతితులూ కూడా కొందరు ఉండకపోరుకదా; వాళ్ళలో నే నొక్కడ్ని."

"ఒరే గోపాల్ ! నువ్వు నన్ను మోసపుచ్చలేవు. నువ్వు నన్ను ఇంత వరకూ చేసిన మోసంకంటె పెద్ద మోసం చేసుకోబోతున్నా విప్పుడు. వెనుక నీకు తగినంత ఏకాగ్రత లేకుండాకూడా కేవలం నాకోసమనుకొని నువ్వు చదివి, అందులో అంత ప్రజ్ఞ చూపించేవంటే, నీ తెలివితేటలూ శక్తి-సామర్థ్యాలూ నేను అనుకొన్నకంటె చాలా గొప్పవి. అటువంటివాడివి ఇంత మీదికివచ్చి, కొద్ది సంవత్సరాలముందు వెనకలకి ఆగలేక, సంసార నిర్వహణలో పడ్డావనుకో. నువ్వు సుఖపడలేవు; ఆమె సుఖపడలేదు. మీ సంతతికి భవిష్యత్తు అంధకారమయంగా, కాదు కాదు, ఆశలూ ఆశయాలూ, ఉండికూడా వాటి నిర్వహణకి తగిన ఆధారం లేకుండా, పోతారు. అంతే కాదు. నువ్వొక గొప్ప ప్రొఫెసరువైతే నీ ప్రజ్ఞవలన నీ బోధనాశక్తివలన ఎందరి మేధాసంపద బైటపడి దేశానికి ఎంతటి ఉపకృతి చేయవలసి ఉందో అంతకంటే కూడా నువ్వు ఏ న్యాయవాదివో, న్యాయమూర్తివో అయి, అన్యాయం జరగడానికి వీలున్న ఎన్ని సందర్భాలలో న్యాయాన్ని నిలబెట్టవలసిఉందో ?"

"అన్నయ్యా ఇదంతా నీ మమకారం కాకపోతే, ఒక మనిషి లేకపోయినంతలో లోకంలో న్యాయం జరగదా, మేధావులు మరి బయలుదేరరా ? సృష్టి అంతా మనతోనే ఉందా ?"

"ఉంది, ఉంది, ఉంది. ప్రతి చిన్న అణువు ఇలా ఎదురుతిరిగితే మన సృష్టే లేదు. మనం ఎంత అల్పులమో అంత మహత్తరులము కూడాను. మనలోని, ప్రతిసూక్ష్మాతి సూక్ష్మమయిన కణంకూడా మన మొత్తానికి మేలుకీళ్ళు నిర్ణయించడంలో భాగం పంచుకున్నట్టుగానే మనం ధరించవలసిన

పాత్రకూడా అంత ముఖ్యమైనదే. నీతో వాదించడం ఎందుకుగాని, ఎంత ముఖ్యమైన శారీరక భాగమయినా దుష్టమైనప్పుడు, సంస్కరణ సాధ్యం కానప్పుడు, శేషాంగ శ్రేణి సౌఖ్యం నిమిత్తం ఖండించితీరాలి. సంస్కరణకీ నిజమయిన నిగ్రహానికీ, అతీతమూ, అసాధ్యమూ అంటూ వుండదు. ఆ ప్రయత్నమే ఉండాలిగాని, నాకు మరి రైలు టైము దగ్గర పడుతూన్నట్టుంది. ఎక్కువమాటలు వద్దు. నువ్వు చెప్పినమాటలు విన్నమీదటకూడా నాకు నీమీద అసహ్యం కలగలేదు. నీలో కొన్ని లోటుపాట్లున్నాయంటే వాటిని అతిక్రమించడానికి నువ్వుచేసిన ప్రయత్నమూ తరవాత కలిగిన పశ్చాత్తాపమూ, తగిన ప్రాయశ్చిత్తంకిందనే లెక్క. ఊఁహుఁ మరేంమాట్లాడకుండా విను. నీమాటలే నిజమయితే ఆ అమ్మాయి తెలివయినదీ, తన భవిష్యత్తునీ, నీ భవిష్యత్తునీ గుర్తించ గలిగినదే అయి ఉండాలి. అటువంటి మనిషిని ఒప్పించడం ఏమీ కష్టంకాదు. నీకు మొగమాటంగా ఉంటే ఆభారం నాకు విడిచిపెట్టు. నీ చదువు పూర్తయి, నువ్వేదో ఒక పద్ధతిలో స్థిరపడేవరకూ ఆగమందాం.

“అది మరి కుదరదు. వాళ్ళ కుటుంబ పరిస్థితులు, ఆమెకంటె చిన్నపిల్లకి ఏదో దగ్గర సంబంధం ఉండడం, ఒకటికాదు రెండుకాదు, చాలా చాలా అడ్డంకులున్నాయి. ఇప్పుడిలా మేము లేచి రావడంకూడా వాళ్ళ కుటుంబదృష్ట్యా చాలా కష్టమేకాని, ఆమె కేవలం నాకోసం సర్వం విడిచిపెట్టింది. ఇప్పుడు మరి వెనక్కి తిరగడమన్నది లేదు. నువ్వు నా చదువుకోసమని, నీ అవసరాలనుకూడా కాదని కొంత నిలవచేసేవు: నెలనెలా నూరూ నూటయాభై ఎంత కావాలంటే అంత పంపిస్తున్నావు. నా కేమాత్రం కుతూహలం ఉన్నా, నీ తల తాకట్టు పెట్టి అయినా విదేశాలకు సయితం పంపించడానికి సంతోషంగా అంగీకరించ గలవు. ఇప్పుడుకాకపోతే మరి కొన్నాళ్ళు పోయినతర్వాత నేను సుఖపడలేని ఏ తగులాటంలోనో పడి ఇబ్బందులు పడేకంటే నా కోసం తల్లిదండ్రులను కుటుంబ మర్యాదనూ తృణప్రాయంగా చూసిన ఒక అమాయకురాలితో కలిసి కష్టసుఖాలు పంచుకోవడంలో పొరపాటేముంది ? మాది కేవలం కళ్ళుకప్పే ఉద్రేకపు పొంగు అనుకోకు. ఇదివరకేకాదు, ఈ రెండురోజుల ఏకాంతంలోనూ ఒకరికొకరం తాకనయినా లేదు. తెలుసునా ? ఆమె నా కోసం తన వాళ్ళను గురించిన ఆలోచన అయినా చేయలేదు. నేనే నిన్ను అసంతృప్తి పరచలేక ఇలా వచ్చాను. ఇప్పుడు నే నడిగిన డబ్బు అంత ముఖ్యం కాదు; నువ్వు నా మీద పెట్టు

కోన్న ఆశలన్నీ భగ్నం చేసిన నా శక్తిని నువ్వు అర్థంచేసుకొని మనసారా క్షమించి ఆశీర్వదించి పంపిస్తే చాలును అన్నయ్యా."

రామకృష్ణ ఈ మాటల ప్రాబల్యానికి లొంగిపోయే ననుకున్నాడు. కాని, అంతలోనే ఆఫీసు బంట్రోతువచ్చి "జట్కా వచ్చింది బాబూ" అనడంతో మనసులోని ఉద్వేగపుపాలు తగ్గిపోయింది. బంట్రోతుతో పరుపుచుట్ట, సంచీ జట్కాలో ఉంచమనటంతో మామూలు రామకృష్ణ అయిపోయేడు. పరిశుభ్రంగా కళ్ళజోడు అద్దాలను మళ్ళీ, తుడుస్తూ, ఏమాత్రమూ గాభరాలేని కంఠధ్వనితో.

"ఇవాళ నువ్వు వచ్చావంటే ఒక మాదిరిగా సంతోషించాను. నీ కోసమై నేను, నా తక్కిన బాధ్యతలనుండి తప్పించుకున్నా ననిపించుకోడం ఇష్టంలేక పెళ్లిచేసుకోందికి ఈ నాటికి అంగీకరించాను. అందుకే, అంటే, ఆ అమ్మాయిని చూడడానికే, ఇప్పుడీ ప్రయాణం. ఈ సంబంధం గురించి మాట ఇచ్చి ఉండకపోతే ఈనాటి నీలోని పతనాన్ని చూసి, ఆత్మహత్య చేసుకోందికి కూడా వెనుదియ్యకపోయేవాణ్ణి. నా ఆత్మశాంతికోసం అయినా నువ్వు నే ననుకొన్న విధంగా ప్రవర్తించి ఉందువు. సరే, మరెందుకీ వృథా మాటలు. ఈ రామకృష్ణమాట తిరిగే మనిషి కాడు. వెళతాను; నా విధి నేను నిర్వహిస్తాను. అయితే నీ చదువుకేమీ అంతరాయం రాకుండా అన్ని ఏర్పాట్లూ చేశాను. ఇదుగో, ఒక్క అయిదు నిమిషాలు వ్యవధి ఇస్తున్నాను. ఈ లోగా ఆలోచించుకో—ఆమె గురించి కాదు, ముఖ్యంగా నీ గురించి ఆలోచించుకో. నా మాట వినే ఉద్దేశంలో ఉంటే నే నీ ప్రయాణం ఈ రాత్రికో రేపటికో వాయిదా వేసుకుంటాను. ఆ అమ్మాయినీ, వాళ్ళవాళ్ళనీ సమాధానపరిచే పూచీ నాది. ఇప్పుడు జరిగిన నష్టానికి వాళ్ళకి తగిన పరిహార మిస్తాము. చూడు, అదుగో అయిదు నిమిషాల్లో అరగంట కొడుతుంది. కొట్టగానే నీ నిశ్చయం తెలియజెయ్యాలి. నా మాట వింటానంటే తక్కిన బాధంతా నేను పడతాను."

కొద్ది సెకెనులు నిశ్శబ్దంగా ఉండి గోపాల్ "అయిదు నిమిషాలు కాదు, అయిదు గంటలు ఆలోచించినా ఇంతే. తక్కిన విషయాల్లో కాక పోయినా మాట వెనక్కి తిరగకపోవడం అనే విషయంలో నేను నీ తమ్ముణ్ణే. వెళ్తున్నాను. మరి నన్ను పిలవకు. శలవు."

గోపాల్ లేచి వెళ్ళిపోయినా తాను అన్న అయిదు నిమిషాలు గడిచే వరకూ లేవలేకపోయాడు రామకృష్ణ. గడియారం టంగుమని అరగంట కొట్టింది. లేవాలంటే కష్టమనిపించింది. కళ్ళజోడు తీసి టేబిలుమీద పడేసి, ఈ మారు కళ్ళనే చేతి రుమాలతో తుడుచుకోవలసి వచ్చింది. తుడుచుకుం టున్నకొద్దీ ఆ అవసరం మరీ ఎక్కువ కాసాగింది. బంట్రోతు వస్తే కనబడి పోతానేమోనని లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి నిల్చున్నాడు. ఎన్నటికీ పూలు పూయని ముళ్ళ గులాబీ మొక్కవంక చూస్తూను.

అతను అటునుంచి తిరిగి చూసేసరికి ఇందాకా గోపాల్ కూర్చొని వున్న కుర్చీలోనే, ఆకుపచ్చని చీర కట్టుకునివున్న, ఒక అందమైన సుమారు పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఉంది. ఆమె లేచి నిలబడి నమస్కరిస్తూ "నే నెవరో మీకు తెలుసును. అందుచేత నన్ను నేను పరిచయం చేసుకోనక్కరలేదు. నేను వచ్చేసరికి మీ రిద్దరూ మాట్లాడుతున్నారు. అదీ నాకు ముఖ్యంగా సంబంధించిన విషయం అయితే నేను ఎదురుగా రాకుండా పక్కగా వినడం తప్పే అని తెలియకపోలేదుగాని, మరింకేం చెయ్యాలో తోచలేదు. మీరు ఆయన కిచ్చిన అయిదు నిమిషాల కాలం నాకూ ఇచ్చినట్టే అనుకున్నాను. ఆ అయిదు నిమిషాలలోనూ గప్‌చిప్‌గా తిరిగి హోటలుకి వెళ్ళిపోడంగాని, తిన్నగా రయిలుస్టేషనుకి పోవడంగాని చెయ్యాలనుకొన్నాను. కాని, అయిదు నిమిషాలలోపునే ఆయన లేచి వెళ్ళిపోయారు, నేను ఆయనతో కలిసి వెళ్ళ లేదు, రైల్వేస్టేషనుకి వెళ్ళడానికి నిశ్చయం ఏర్పడలేదు—ఏమీ అనుకో కుండా ఇలా లోపల ప్రవేశించాను. అయితే నే నిలా రావడంలో మీకూ కొంత సదుపాయం లేకపోలేదు."

రామకృష్ణ మాట్లాడకుండా టేబిలుమీది కళ్ళజోడు తీసి పెట్టుకొని చేతి వాచీవంక చూశాడు.

"మీకు నాయెడల ఎంత అసహ్యమూ కోపమూ కలగవలసి ఉందో నాకు తెలుసును. మీ మొగంలో అవి కనబడకుండా దాచుకునే ప్రయత్నం చెయ్యకపోయినందుకు నాకు నిజంగా నే సంతోషంగా ఉంది. నాకు అవతల తొందర రైలు ప్రయాణం ఉంది. ముక్కూ మొగం ఎరగని నీగొడవేమిటనే కదూ—అనుకుంటున్నారు."

అప్రయత్నంగా రామకృష్ణ "ఇంతటి అసాధ్యురాలివి గనక నే పూవా డంతగా దిగజారిపోయాడు" అని, అన్న వెంటనే, తనమీద తనకి ఎంతో

కోపం వచ్చింది. తిన్నగాపోయి జట్కాలో కూర్చోక ఈ మనిషితో ఎందుకు మాట్లాడానా? అని.

ఆమెకి అతని మొగంలోని మాటలు చదువు కోడంలో ఏమీ శ్రమ లేకపోయింది. నిబ్బరమయిన గొంతుతో అంది "కూర్చోండి. నేను మిమ్మల్ని కోరేది కూడా అయిదు నిమిషాలకంటె ఎక్కువలేదు. మీరిందాకా మీ తమ్ముడిగారితో మాట్లాడ్డంలో కొన్ని కొన్ని పరిస్థితుల్లో ఇప్పటి ప్రయాణం అవసరమయితే రాత్రికి, రేపటికి వాయిదా వేసుకోందికి అభ్యంతరం లేద న్నారు కదూ. ఇప్పుడు అంతకంటె చాలా ఎక్కువ అవసరం ఉందనే నా నమ్మకం. ఇంకా మీరు నన్నడిగి, నా సలహా వినే మాటయితే, ఉహుఁ నామీద కళ్ళెర్రజేసి లాభంలేదు, అసలు వెళ్ళడం పెళ్ళి చూపులకని వెళ్తున్నా రాయె. ఇలా కళ్ళెర్రజేసి హడలగొడితే ఏ పెళ్ళికూతురు మాత్రం మీ హృద యంలోని మంచినీ నిండుదనాన్నీ గ్రహించుకోగలదు? మీకిష్టంలేకపోయినా నా సలహా యిస్తున్నాను. మీరీ ప్రయాణం అసలే మానుకోవడం ఎంతయినా సమంజసంగా ఉంటుంది."

రామకృష్ణ ఆమె కూర్చోండి, అనగానే తనకి తెలియకుండానే కూర్చున్నాడు. మళ్ళీ ఇందాకటిలాగే ఆలోచన తెమలకముందే మాట బైటికి వచ్చింది. "తప్పంతా నా తమ్ముడిలో లేదు. ఇంతటి ప్రగల్భఘోరటి గనకనే వాడంతలో లొంగిపోయాడు."

"ఇంత అనుభవం ఉన్న మీరు ఇంత తొందరగా ఎదుటి మనుష్యుల స్వభావాలనుగూర్చి నిశ్చయాలు చేసుకుంటే ఎలాగ? సరే, అసలు సంగతికి వద్దాము. మీ ప్రయాణం మానుకోవాలనడం మరొక దురుద్దేశంతో కాదు. మీరు ఏ ఉద్దేశంతో అయితే ప్రయాణం చెయ్యబోతున్నారో ఆ ఉద్దేశం ఇక్కడనే నెరవేరి పోతున్నది కదా అని ఇంతకాలం కలగని అభిప్రాయం మీకు కలగడంతోనే, మహమ్మదు దగ్గరికి మక్కా వచ్చిందన్నట్లు, మీరు వెదుకబోయిన తీగ మీ కాళ్ళని చుట్టుకోవాలని కాకపోయినా, కాళ్ళమీద పడే ప్రయత్నంతో వచ్చింది. నే నేమీ మిమ్మల్ని మోసం చెయ్యడంలేదు. మీరు రైలుప్రయాణపు శ్రమ ననుభవించినా అక్కడ మీరు చూడవలసిన పెళ్ళికూతురు ఉండడానికి వీల్లేదు. ఎంచేతంటే ఆమె ఇక్కడేనే మీ కళ్ళ ఎదురుగా ఉంది గనక.

"ఆఁ ఏమిటేమిటీ ?" అంటూ ఒక్క-క్షణం కళ్ళు పెద్దవి చేసిచూసి మోచేతులలో తలపెట్టుకొని, కళ్ళు అరచేతులతో బలంగా మూసుకొన్నాడు రామకృష్ణ.

కొద్దిసెకన్లు ఊరుకొని ఆమె నెమ్మదిగా చెప్పుకొని పోసాగింది. "నాకు మొదట మీరనీ తెలియలేదు. మీతమ్ముడుగారికి ఇప్పటికి నాకు వచ్చిన పెళ్లి సంబంధం మీదేనని తెలియదు. అసలతనికి ఆ ఊసెత్తుతేనే తలనొప్పి. అయితే, ఇద్దరం తీరా యిల్లువిడిచినతర్వాత నాకు బోధపడింది. మీ రిద్దరూ సోదరులని. అయితే, ఆయనమీతో చెప్పి, ఒప్పించి, మీ ఆశీర్వాదం పొందు తానంటే వద్దనలేకపోయాను. పైగా నాకూ అదే అవసరంతోచింది. అంటే మీరు క్షమించి, ఆశీర్వదించగలిగితే, తరవాత అక్కడికి వెళ్ళి చెందే ఆశా భంగపు బాధ తగ్గుతుందనుకున్నాను. అంతా నాదే పొరపాటు. ఇక్కడ దిగనివ్వకుండా తీసుకొని పోవలసింది. మీరు ఈనాడు హఠాత్తుగా కలిగిన ఆశాభంగము ఆవేదనా కొంత తగ్గును. ఏమో, అందువల్ల, మీ అనుమతి లేకుండా వచ్చినందుకు గోపాల్ శాశ్వతంగా మీనుండి విడిపోయి, ఎన్నటికీ తీరని దుఃఖంతో క్రుంగిపోవునేమో ?"

"చేసేవి దరిద్రపు వెధవపనులున్నూ, మళ్ళీ మధ్యలో నాటకాల్లోని పాత్రల్లాగ ఆశయాలగురించి, ఆదర్శాలగురించి కబుర్లున్నూ" చేతనయినంత కాఠిన్యాన్ని గొంతులోకి తెచ్చుకొని అన్నాడు.

"నాటకాల్లోతప్ప, యథార్థజీవితంలో ఆశయాలూ ఆదర్శాలూ ఉండ డానికి వీల్లేదంటారుకదూ ? ఇందాకా మీరు మీ తమ్ముడు గోపాల్‌తో అన్న మాటలను ఉన్నవి ఉన్నట్టుగానే రాస్తే, యథార్థమని నమ్మడానికి చాలామందికి కష్టంగా ఉంటుంది. మీరు పెద్దలు మీరు తెలియనిదేముంది ? ఇక మీరు, వెధవపనులన్నారే..."

"వెధవ పనులా, ఇంకా ఇంకా..."

తరవాత మాటకోసం కొంతసేపు తడుముకుని, ఆ వాక్యం అసం పూర్తిగా విడిచిపెట్టేశాడు. తరువాత అంతకంటె సాధువయిన కంఠస్వరంతో, "ఇలా యథార్థవాదిత్వం ప్రదర్శించి ఒకళ్ళను కాల్చుకొని తినేకంటె, వాడికి నెలకి ఎంత కావాలంటే అంత పంపిస్తున్నాను కదా, రహస్యంగా సంసార యాత్ర సాగించలేకపోయారు ?

"నేనయితే మీ దృష్టిలో ప్రపంచంలో ఉండడానికి వీలున్న దుర్గుణాలన్నీ ముద్దగా చేసిన మనిషిని కావచ్చును. గాని, మీ తమ్ముడికి అటువంటి ఆలోచన అయినా కలగటానికి సావకాశం లేదని మీకు మాత్రం తెలియదా? ఏమో, నాకు చూడగా చూడగా మీకు మీ తమ్ముడిమీద ఉన్న అభిమానం నిజంగా ఆయనమీదకంటె, ఆయనలో మీరు కావాలనుకున్న కొన్ని లక్షణాలమీదనే ననిపిస్తుంది. ఇటువంటి స్వార్థాన్ని, పైకి ఎంత గొప్పదిగా కనిపించినా, భరించడం మాత్రం చాలా కష్టం. సరిగా నన్ను గురించిన మావాళ్ళ ఆలోచనలూ ఇటువంటివే. నిన్న మొన్నటివరకు నన్ను బాగా చదివించి, నాచేత ఉద్యోగం చేయించి, కుటుంబ నిర్వాహణకు తక్కిన పిల్లల అభివృద్ధికి వినియోగించుకోవాలనుకున్నారు. కాని, ఇంతలో ఇప్పుడు చెయ్యకపోతే మా చెల్లెలికి మేనరికం సంబంధం తప్పిపోయే ప్రమాదం కనిపించింది; వేళకి మీ సంబంధం ఒకటి వచ్చిపడింది. ఒక్కమారుగా పథకం మారిపోయింది. ఇద్దరు ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి, వెళ్ళిపోవడంకంటె కావలసిందే ముందనుకున్నారు. ఇన్నాళ్ళూ ఆ పద్ధతి గొప్పది; ఇప్పుడిది గొప్పది. ఎంతసేపూ వాళ్ళలోని ఆశలూ సంఘంలో బడాయిగా చెప్పుకునే అవకాశమూ, ఇంతే తప్ప నా గురించిన ఆలోచనే లేదు. ఈ చిక్కులన్నీ చాలనట్టు మీరు గోపాల్‌కి దైవతుల్యులయిన అన్నగారు కూడా కావడం తటస్థించింది. అయితే ఈ చిక్కు సంగతి గోపాల్‌కి ఇంతవరకూ తెలియదు" ఇకముందు తెలియవలసిన అవసరం కూడా లేదు.

రామకృష్ణ కుర్చీలోంచి లేచి, అత్యంతిమైన వేగంతో గదిలో ఆచివర నుండి ఈ చివరవరకూ, పచారు చెయ్యసాగాడు. అతని మొగం అంతా చెమటముత్యాలతో నిండిపోయింది.

ఆమె గది అంతా కలయజూచి, తువ్వాలుతీసి, అతనిచేతికి అందించి, "మొగం తుడుచుకోండి, అలిసిపోతారు, కుర్చీలో కుర్చోండి" అంది. అతనికి ఆమెను కాదనేశక్తి లేకపోయింది.

ఆమె మళ్ళీ అందుకొంది. "ఏమిటండీ, మీ రింత పెద్దవారు, అంటే వయసులో నని కాదు. జ్ఞానంలో, అనుభవంలో, ప్రతిభలో, పట్టుపదలలో, కేవలం స్వయం కృషివలన ఎంతో కిందుగా మొదలుపెట్టి ఇంతమీదికి వచ్చేరు. ఇటువంటి మీరు ఒకానొక చిన్న ఆశాభంగానికి ఇంతలా క్రుంగిపోతే...

"చిన్న ఆశాభంగ మేమిటి నా అస్తిత్వం మీదనే నాకు అనుమానం కలుగుతూ ఉంటే. అయితే ఒక మనిషిమీద ఇంకొక మనిషి అతీతంగా ఆశ పెట్టుకోడానికి ఏమి హక్కుంది? హక్కులేని దానిమీద ఆశలు పెట్టుకొంటే ఎప్పటికయినా ఇంతే..."

"ఊఁహూఁ. కాదుగాని మీరు ఇందాకా మీతమ్ముడితో మాట్లాడ్డంలో నాతో వాదించి ఒప్పించి వెనక్కి పంపించే పూచీమీది అన్నారుకదా? ఆ ప్రయత్నం చెయ్యరేం? అంతే కాదు, ఇంకా మరొక పద్ధతికూడా వుందికదూ, నన్ను నయాన్నో భయాన్నో మీవంక తిప్పుకుని, పెళ్ళి చేసుకొందికయినా ప్రయత్నించరేం. రెండు పక్షులూ ఒకే దెబ్బతో పడతాయి కదా? అయితే నన్ను చూసేక నాతో మాట్లాడేక, పెళ్ళిచేసుకోవాలనే ఉద్దేశం అంతరించిపోయి ఉండవచ్చు. నేనంత భయంకరంగా ఉన్నానేమో?"

"అదంతా నాకు తెలియదుగాని, మా తమ్ముడికి ఇదివరకులాగ నన్ను మభ్యపెట్టాలని కాక, యధార్థం చెప్పాలనే ధైర్యం ఎందుకు వచ్చిందో, నీకోసం ప్రపంచంలోని తక్కిన అనుభవాలన్నిటినీ విడిచిపెట్టడం ఎలా త్యాగం కాదనిపించిందో అర్థం అవుతూంది. నిన్ను చేసుకోదలచి హతాశుడయినవాడు మాత్రం మరొకరిని చేసుకోలేడు. ఇంతగా ప్రేమించిన నేనే మా తమ్ముడి అదృష్టానికి అసూయపడకుండా ఉండలేనేమో ననిపిస్తుంది.

లీల "అమ్మయ్య!" అని బ్రహ్మాండమయిన తృప్తితో నిట్టూర్చింది. ఆమె కళ్ళనుండి మొదలయిన రెండు నీటిధారలు అద్దంమీద ప్రవహించినంత మృదువుగా క్రిందికి జారసాగాయి.

రామకృష్ణకి తన కళ్ళలోకూడా నీళ్ళు తిరుగుతున్నాయని తెలయనే లేదు. అతను ఎందుకో తనకే తెలియకుండా చెప్పుకు పోసాగాడు. "ఒకే తల్లి పిల్లలమయినా మా యిద్దరి నడుమ ఉన్న వయస్సులోని భేదంవల్లనో మరేమో, మా తమ్ముడిలో నాలో ఉన్నంత స్వార్థపరత్వమూ, ఆత్మనిగ్రహమనే పేరుతోడి ఆత్మవంచన, మరింక చాలా చాలా పెద్దపేరులు పెట్టుకొన్న ధనదాహమూ ఇవన్నీ వాడిలో ఎంత ప్రయత్నించినా కలుగలేదు. ఇకముందు నీ సాహచర్య ప్రాబల్యంవలన కలగవుకూడా! అయ్యో వెర్రిపిల్లా, ఎందు కేడుస్తావు నవ్వి గంతులేయవలసిన సందర్భంలో" అంటూ అతిసహజంగా వెళ్ళి తువ్వాలు కొసతో ఆమె కన్నీటి చారలను తుడుస్తూ "అబ్బ! ఎంత

కొంచెం మా తమ్ముణ్ణి పోగొట్టుకొని ఉండే వాణ్ణి; ఎంత కొంచెంలో వికసించి పరిమళించవలసిన రెండు జీవితాలను నాశనంచేసి వుండేవాణ్ని !

"నిజంగా నాకు నవ్వాలనీ, చిన్నపిల్లలాగు గెంతాలనే ఉంది—కాని, ఎందుకునాకు ఏడుపు వస్తుందో తెలియకుండా ఉంది. అబ్బ, ఇప్పటి కెన్నడూ మా అమ్మని నాన్ననీ కూడా ఈ క్షణంలో మిమ్మల్ని ప్రేమించినంతగా ప్రేమించిన సందర్భంలేదు. ఇదివరకు గోపాల్ మిమ్మల్ని మానవాతీతులన్నంతగా చెపుతూంటే, లోలోపల కొంత ఈర్ష్య కలిగేది. అబ్బ, నేనే తట్టుకోలేక పోతున్నాను. ఇక ఈ ఆనందానికి గోపాల్ ఏమవుతాడో... వెధవ హోటలు మైలున్నం దూరం ఉంది. ఇటువంటి సుఖసమయాల్లోనయినా మనుష్యులకి రెక్కలు లేకపోతే మరెందుకు ?"

"నిజమే, నిజమేగాని గుమ్మంలో జట్కా ఉంది. ఊఁహుఁ అంత కంటె ఈ సందుచివర టాక్సీ ఒకటి ఉంటుంది. అది తెప్పించుకొందాం. నేనూ వచ్చి, అక్కడ కారులో కూర్చుంటాను. ముగ్గురం కలిసి ఇంటికి వచ్చేద్దాము. అబ్బే, అలా లేచిపోతే లాభంలేదు. కారు వచ్చేలోపుని కాస్త మొగం కడుక్కుని కాఫీ పుచ్చుకోవాలి. ఇది మరి ఏమాత్రమూ కాదనడానికి వీల్లేదు. ఇందాకా నేను తెలిసి మా వాడికీ, తెలియకుండా నీకు ఐదు నిమిషాలు వవ్యధి ఇచ్చాను. ఇప్పుడు నాకు నువ్వు ఆ మాత్రం వ్యవధిఇవ్వాలి. ఈలోగా ఏడుపును కడిగేసుకుని అద్దుకోనక్కర లేకుండానే నవ్వు దానంతటదే వచ్చేస్తుంది."

లీలకేకాదు, రామకృష్ణకి కూడా కారు అతి నెమ్మదిగా పోతున్నట్టే అనిపించింది. హోటలు దగ్గర ఆగగానే, లీల "మరి దిగక్కర్లేదు. అదిగో ఆ చివరనున్న ఏడవ నెంబరు గదే, తాళంవేసి ఉంది. నాకేమో భయంగా ఉంది, తొందరగా రైలుస్టేషనుకి నడిపించండి" అన్నది.

ఒక రయిలు అప్పుడే దూరపు సిగ్నలు దాటి వంకర తిరిగి అంతర్ధానమయిపోయింది. ఇంకొక రైలు రెండవవైపు అయిదు నిమిషాల క్రితమే వెళ్ళిపోయింది. రామకృష్ణ పెద్ద ఆశలేకుండానే దిగి వెళ్ళి స్టేషనంతా తిరిగి వచ్చాడు. వస్తూనే "వాడు మరొక దారిని మా యింటికి వెళ్ళాడేమో ? లేక హోటలుకి వెళ్ళేసరికి నివ్వు కనబడక నిన్ను వెతకడానికి ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో ? లేక ఈసరికి హోటలుకి వచ్చి ఉంటాడేమో ? రయిలులో ఎక్కడికీ వెళ్ళి ఉండడని నా నమ్మకం. ఎందుకు ఎలా వెళతాడు ?

ఎలా వెళతాడు నువ్వు లేకుండా లీల ఏమీ మాట్లాడలేదు. వట్టి శిలా ప్రతిమలా కూర్చుంది. ఆమె కళ్ళలో ఏమీ కదలిక లేదు. ఎదుటి వస్తువుల ప్రతిబింబాలనయినా సరిగా గ్రహించలేకపోతున్నాయి. ఏదో మాట్లాడుతున్నాడేగాని రామకృష్ణకి అనుమానంగానే ఉంది.

మేనేజరు దగ్గర తాళం తీసుకుని, ఆమెను చెయ్యిపట్టుకుని, మెట్లెక్కించి తీసుకుని వెళ్లేడు. తలుపు తియ్యగానే టేబిలుమీద దృష్టికి బాగా కనబడేలాగ పెట్టబడి ఉన్నాయి రెండు ఉత్తరాలు. రామకృష్ణకి అక్కడి తనకని ఉద్దేసింపబడిన ఉత్తరం కనిపించడంలో వింత ఏమీ తోచలేదు. తన ఉత్తరంలో మూడే పంక్తులున్నాయి. రెండవ ఉత్తరంకూడా అట్టే పెద్దదిగా లేదు. ఆమె అది చదవకుండానే "నాకు తెలుసును, నిజంగా ఇందాకటి ఆనందంలో గుండె ఆగిపోతుందనిపించింది. గోపాల్ ఉన్నా భరించలేకపోయి ఉండును. పోనీ, ఇదే మంచిది, నన్ను పట్టిన దౌర్భాగ్యం మరిక అతన్ని బాధించనక్కరలేదు. ఇక మా వాళ్ళ కుటుంబ శ్రేయస్సు, మర్యాద పేరు చెప్పి ఏం చేసుకొన్నా నా అభ్యంతరం ఎంతమాత్రం ఉండదు."

"ఏమిటమ్మా వెర్రిపిల్లవి, ఇప్పుడింత కుంగిపోవలసిన అవసరం ఏమీ లేదే. వాడు ఆశాభంగంవలన, కాస్త వైరాగ్యధోరణిలో పడినా ఆత్మహత్య చేసుకొనే ఉద్దేశం మాత్రం లేదని స్పష్టంగా రాశాడు. ఈ రాత్రి రైళ్లలో నేనూ మా స్నేహితు లిద్దరు ముగ్గురూ బయలుదేరి నలువంకలా గాలిస్తాము. పత్రికలలో ప్రకటిస్తాము. మహా అయితే వారం పదిరోజు లవుతుంది. వాణ్ణి తీసుకొనివచ్చి పువ్వులలోపెట్టి అందజేయడానికి నాది హామి.

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు సడిలిపోయాయి. రామకృష్ణ ఆర్థిక సహాయంతో లీల బి. యస్. సి. పూర్తిచేసింది; డాక్టరీ చదివింది; ప్రాక్టీసు పెట్టింది— ప్రాక్టీసు పెట్టిన కొత్తలోనే ఒక మోసపోయిన కన్నె తల్లి, కవలపిల్లలను కని లీలచేతిలో వాళ్లను పెట్టిపోయింది.

కవలలకు వేణుగోపాల్ అని పేర్లు పెట్టింది. రాముని తానుంచుకుని వేణుని రామకృష్ణ కిచ్చింది. అంతవరకూ ఏడాదికి అధమం ఒక నెల అయినా తమ్ముడ్ని వెదకడంలో గడుపుతూ వచ్చిన రామకృష్ణకి యెంత ఊరట లభించింది; క్రమంగా పసిపిల్లవాడితోపాటు తాను పసిపిల్లవాడయిపో సాగాడు.

ఎప్పుడయినా లీల అతణ్ని చూడడానికి వచ్చినప్పుడు అంటూ ఉండేది. "చూడండి మా రాముని, ఎంత మప్పితంగా ఉంటాడో! మీ ఇంట్లో మీ వేణు యజమానో మీరు యజమానో కూడా తెలియదు. అంతేకాదు, మీరు వాడికి అనారోగ్యం కలిగే పరిస్థితుల్లో కూడా వాడిని అదుపు ఆజ్ఞల్లో ఉంచలేక పోతున్నారు చూడండి" అని.

రామకృష్ణ "నిజమే నిజమే. నేనూ అలాగే అనుకుంటాను గాని, నిజంగానే వాణ్ని అదుపులో పెట్టాలనే కోరిక బలంగా లేదు; అప్పుడప్పుడు కలిగిన అంతటి మనసు నిబ్బరం లేదు. అయిదు నిమిషాలు వాడి మొఖం కనబడకపోయే సరికల్లా ఏమీ తోచదు. వాడు పెద్దయాక మాటకేం ఇప్పటినుండి నన్ను ద్వేషించకుండా ఉంటే చాలునన్న నా స్వార్థానికి లొంగిపోతున్నాను. ఒక్క కఠినమయిన మాట! ఒక్క అయిదు నిమిషాల కాలము ఎంత దారుణమయినదో ఇంతగా అనుభవిస్తున్నాను. ఇంకా మరి అదుపు ఆజ్ఞల తాపత్రయం దేనికి. నాకు మీ రాముమీద నువ్వు ఉపయోగించే అధికారమూ క్రమశిక్షణా చూస్తే భయంగా ఉంది. వాణ్నికూడా ఇక్కడే ఉంచి, నువ్వు వెళ్ళి హాయిగా పెళ్ళి చేసుకుని...

"మాస్టారు! ఇదివరకే చెప్పాను. మీరు మళ్ళీ మళ్ళీ ఆ మాటంటూ ఉంటే, మీకు కనబడడమే మానేస్తానని-నా కష్టంకంటె తక్కువ కష్టంలో ఉండి మీరు నన్ను ఓదార్చినా అర్థం ఉండునుగాని...రామూ అలా స్తబ్దులా కూర్చొని పెద్దవాళ్ళ మాటలు వినకపోతే, తోటలోకి వెళ్ళి వేణుతో ఆడుకోకూడదూ? చెట్లూ చేమలూ ఎక్కి మాత్రం కాళ్ళు చేతులూ విరుచుకోకండి..."